ప్రజాశక్తి

శుక్రవారం 16 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

2 వేల మంది బదిలీ

సచివాలయాల ఉద్యోగులకు శాఖల వారీగా కౌన్సెలింగ్

ఆర్‌జెడి శ్రీనివాసరావుకు దరఖాస్తులు ఇస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ గురువారం గుంటూరులోని వేర్వేరు ప్రదేశాల్లో నిర్వహించారు. రెండేళ్లపాటు ఒకేచోట పనిచేసిన వారు రిక్వెస్టు బదిలీలు కోరుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు మూడు వేల వరకు ఖాళీలు న్నాయి. ఖాళీగా ఉన్న స్థానాల్లోనే బదిలీ కోరుకునే అవకాశం కల్పించారు. వ్యక్తిగత సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలతో పాటు భార్యభర్త వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తుంటే ఒకే ప్రదేశంలో పనిచేసేందుకు వీలుగా బదిలీ కోరుకున్న వారికి ప్రాధాన్యం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన తొలిదశ ప్రక్రియ పూర్తయిందని, అంతర్‌జిల్లాల బదిలీల ప్రక్రియ త్వరలో నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

మహిళా పోలీసులకు స్థానిక పోలీసు కల్యాణ మండపం, విఆర్‌వోలకు కలెక్టరేట్‌లోని డిఆర్‌సి హాలు, మున్సిపల్ పరిపాలన శాఖకు సంబంధించి వార్డు అడ్మిన్, ఎన్విరాన్‌మెంట్, శానిటేషన్, సంక్షేమ, విద్యాశాఖకు సంబంధించిన ఉద్యోగులకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు జెడ్‌పి కాంపౌండ్, సర్వేయర్సుకు కలెక్టరేట్, ఎఎన్‌ఎంలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పరిషత్‌లో, సంక్షేమ, విద్యాశాఖకు చెందిన ఉద్యోగులకు పరివర్తన్ భవన్‌లో అధికారులు కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 19 శాఖలకు సంబంధించిన వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు మొత్తం 17 వేల మంది ఉండగా వీరిలో 2 వేల మంది వరకు బదిలీ కోరుకున్నట్టు సమాచారం. గ్రామ సచివాలయాల్లో 11 శాఖలు, వార్డు సచివాలయాల్లో 8 శాఖలకు చెందిన అధికారులు బదిలీల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

ఎక్కువ మంది వారు నివశిస్తున్న ప్రదేశానికి దగ్గరగా ఉన్న సచివాలయాల్లోనే మూడేళ్ల క్రితం ఉద్యోగం వచ్చిన దృష్ట్యా ఎక్కువ మంది బదిలీ కోరుకోలేదని చెబుతున్నారు. మహిళా పోలీసుల బదిలీలను జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా వార్డు మహిళా పోలీసుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు ఎస్‌పి తెలిపారు. బదిలీల్లో సిఫార్సులకు తావులేకుండా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ విభాగంలో గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి జిల్లా పరిషత్‌లో నిర్వహించారు. విఆర్‌వోలకు కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రావు, సర్వేయర్లకు ఆ శాఖ ఎడి రూప్లా నాయక్, ఎఎన్‌ఎంలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, సంక్షేమ విద్యాశాఖలకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు మధుసూదనరావు, విద్యాశాఖ అధికారి పి.శైలజ కౌన్సిలింగ్ నిర్వహించారు.

8 లో

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

విద్యుత్ ఛార్జీలు తగ్గించకుంటే ఉద్యమిస్తాం

గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

రెంటచింతలలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - రెంటచింతల

రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలకు పేరుగాంచిన మండల కేంద్రమైన రెంటచింతలలో గురువారం 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనది. జూన్ రెండో వారం ముగిసినా వానజల్లు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు, బాలింతలు నానా యాతన పడుతున్నారు. విద్యార్థులను పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు జంకుతున్నారు. కొందరు పంపడం లేదు. మరోవైపు వడగాలులతో జనసంచారం తగ్గి వీధులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. రుతుపవనాలు ఎప్పుడొస్తాయా? అని జనం ఎదురు చూస్తున్నారు.

పర్మినెంట్ చేయండి..

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

వార్తలు లోపలి పేజీల్లో

రాష్ట్ర కమిటీ సమావేశంలో నాయకులు

చేనేత సమస్యలపై 19న ధర్నాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి, మంగళగిరి రూరల్

చేనేత రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించి చేనేత రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. చేనేత సమస్యలపై కలెక్టరేట్ల వద్ద 19న నిర్వహించే ధర్నాల్లో చేనేత కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ఫణిదం చేనేత సొసైటీ బిల్డింగులో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత పై జీఎస్టీని రద్దు చేయాలని, 11 రకాల రిజర్వేషన్లను ఉల్లంఘించిన పవర్ రూమ్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేతకు రాయితీలను కొనసాగించాలని, ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డును, పథకాలను పునరుద్ధరించాలని కోరారు. వీటితోపాటు ఇతర సమస్యలనూ ప్రభుత్వాలు పరిష్కరించాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో కార్మికులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామాంజనేయులు అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షులు కె.శివదుర్గారావు, సహాయ కార్యదర్శి డి.రామారావు, ఎ.వీరబ్రహ్మం, కె.వెంకటేశ్వరరావు, జి.రాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ధర్నా జయప్రదం

2లో

యు1 జోన్‌పై మళ్లీ అలజడి

రైతులకు నోటీసులు - మార్కెట్ విలువపై రెండు శాతం పన్ను చెల్లించాలన్న సిఆర్‌డిఎ

యు1 జోన్‌పై ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి, కొలనుకొండ, కుంచనపల్లి గ్రామాలకు చెందిన యు1 జోన్ బాధిత రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ వాల్యు ప్రకారం రెండు శాతం పన్ను చెల్లిస్తే రిజర్వ్ జోన్ ఎత్తివేస్తామని సిఆర్‌డిఎ అధికారులు 381 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నోటీస్ బోర్డులో నోటీసు అంటించారు. గురువారం నోటీసు అందుకున్న రైతుల్లో ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

యు1 జోన్ కింద ఈ మూడు గ్రామాల్లో 178 ఎకరాల భూమి ఉంది. 381 మంది రైతులకు సంబంధించి సన్న, చిన్నకారు రైతులు ఈ భూమి ఆధారపడి జీవిస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వం రాజధాని అమరావతిని దృష్టిలో పెట్టుకుని 178 ఎకరాలను యు1 రిజర్వ్ జోన్‌గా ప్రకటించింది. అప్పటి భూముల అమ్మకాలు, కొనుగోలు అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా అనేక రైతు కుటుంబాలు తమ ఇంట్లో శుభకార్యాలకు, ఇతర అవసరాలకు తమ భూములు అమ్ముకోవాలేని పరిస్థితిలోకి నెట్టపడ్డారు. భూమి ఉందనే భరోసాతో కోట్లాది రూపాయలు అప్పులు చేసి తమ అవసరాలు తీర్చుకున్నారు. ఎప్పటికైనా రిజర్వ్ జోన్ ఎత్తేస్తారని, తమ భూములు అమ్ముకుంటే కష్టాలు గట్టెక్కుతాయని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. టిడిపి ప్రభుత్వం పోయి వైసిపి ప్రభుత్వం వచ్చింది. రిజర్వ్ జోన్ ఎత్తివేస్తామని అప్పట్లో హామీనిచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రెండు సంవత్సరాలు తడిచినా రిజర్వ్ జోన్ ఎత్తివేయలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు దిగారు. సుమారు 146 రోజులు తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు రిలే దీక్షలకు దిగారు. ఏడాదిన్నర కిందట స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దీక్షా శిబిరానికి వచ్చి నయా పైసా ఖర్చు లేకుండా రిజర్వ్ జోన్ ఎత్తివేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీనివ్వడంతో రైతులు దీక్షను విరమించారు. నాడు ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఎటువంటి పన్ను లేకుండా జోన్ ఎత్తివేస్తారని భావిస్తే ఈ విధంగా నోటీసులు రావడం పట్ల రైతాంగంలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. దీని ప్రకారం ప్రస్తుతం రైతులు రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే రుసుమేమీ చెల్లించకుండానే రిజర్వ్ జోన్ ఎత్తివేయాల్సిందేనని రైతులు కోరుతున్నారు. లేకుంటే ఒక శాతం చెల్లించడానికి రైతులు ముందుకొస్తున్నారు. అదికూడా ప్రభుత్వం నిర్ణయించిన వాల్యు ప్రకారం చెల్లిస్తామని చెబుతున్నారు.

దీనిపై యు1 రిజర్వ్ జోన్ కన్వీనర్ దొంతిరెడ్డి సాంబిరెడ్డిని సంప్రదించగా దీనిపై పూర్తి సమాచారం తెలుసుకున్న తరువాత స్పందిస్తామన్నారు. నోటీసులు అందుకున్న కొంతమంది సిఆర్‌డిఎ

2లో

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, ముసుగులో నిందితులు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

2.1 కిలోల సరుకు సీజ్

విద్యార్థులు, ఆటో డ్రైవర్లే లక్ష్యంగా అమ్మకాలు

ప్రజాశక్తి-తెనాలి

కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్లే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బి.జనార్ధనరావు చెప్పారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో వివరాలను విలేకర్లకు డీఎస్పీ గురువారం వెల్లడించారు. సంగంజాగర్లమూడికి చెందిన మహ్మద్ అబ్దుల్ రషీద్ అలియాస్ రషీద్ పదేళ్లుగా వ్యసనాలకు బానిసై 2012 నుంచే దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఆ సొమ్ముతో జల్సాలకు అలవాటు పడ్డాడు. తెనాలి వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లతో పాటు పలు పోలీసు స్టేషన్లలో రషీద్‌పై కేసులున్నాయి. 2021లో టూటౌన్ పోలీస్ స్టేషన్‌పరిధిలో ఏడు కిలోల గంజాయి పట్టుబడిన కేసులోనూ రషీద్ నిందితుడు. బైక్ చోరీ కేసులో అరెస్టయిన రషీద్ గుంటూరు జైల్లో ఉండగా అతనికి వైఎస్సార్ జిల్లా లోతుగడ్డ ప్రాంతానికి చెందిన గంజాయి కేసులో నిందితుడు సాయి అలియాస్ వంటల నాగేంద్రతో పరిచయమైంది. ఆ పరిచయంతో గంజాయి విక్రయానికి రషీద్ తెరతీశాడు. ఈ నేపథ్యంలో సాయి నుంచి గంజాయిని కిలో రూ.3 వేల చొప్పున కొనుగోలు చేసి, రూ.15 వేలకు విక్రయిస్తూ జల్సా చేస్తున్నాడు. ఇటీవల కాలంలో

2లో

నీట్, ఎంసెట్‌లో పల్లోటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అమరావతి

ఎపి ఇఎపి సెట్ ఫలితాల్లో స్థానిక పల్లోటి కళాశాల విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచారు. ఎంసెట్‌లో అమరావతికి చెందిన ఎం.శివ మాధవ్ 821 ర్యాంకు సాధించగా నీట్‌లో 720 మార్కులకు గాను 529 మార్కులు సాధించారు. తల్లం శర్వాణి ఎంసెట్‌లో 4247 ర్యాంకు, నీట్‌లో 829 ర్యాంకు సాధించారు. ఎంసెట్‌లో షేక్ సుమీమియా 7972, ఎన్.వసంతలక్ష్మి 8540, కె.వైష్ణవి 10,316 ర్యాంకులు సాధించారు. పల్లోటి కాలెజీ విద్యార్థులు 58 మంది ఎంసెట్‌కు క్వాలిఫై అవగా 15 మంది 20 వేల లోపు ర్యాంకులు సాధించారు. ర్యాంకర్లను గురువారం కళాశాల ఆవరణలో ఎంపిడిఒ పి.మాధురి, కరస్పాండెంట్ ఫాదర్ భాస్కర్, ప్రిన్సిపాల్ పి.కష్ణమోహన్ సత్కరించారు.

భూ హక్కు పత్రాల పంపిణీలో జాప్యం వద్దు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆన్‌లైన్‌లో ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి శ్యాంప్రసాద్

పల్నాడు జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో రీ సర్వేను పూర్తిచేసిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి సంబంధిత లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందించాలని సిబ్బందిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను జెసి గురువారం పరిశీలించారు. సాంకేతిక సమస్యలుంటే వెంటనే నేషనల్ ఇన్ఫర్మేమాటిక్ సెంటర్ (ఎన్ఐసి)ను సంప్రదించాలని సూచించారు. భూ హక్కు పత్రాలు అందించే విషయంలో జాప్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా రీ సర్వే కార్యక్రమం పర్యవేక్షణ అధికారి జి.వసంత బాబు, తహశీల్దార్ రమణా నాయక్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో వైద్యారోగ్య శాఖ అధికారులు

మాతాశిశు మరణాల నివారణకు కృషి

ప్రజాశక్తి - నరసరావుపేట

మాతా శిశు మరణాల నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆశా నోడల్ అధికారుల ఆమె గురువారం సమీక్షించారు. ఆశా కార్యకర్తల విధి విధానాలను వారి యొక్క పని తీరును ఆశాలు మొబైల్ యాప్‌ల ద్వారా మాత శిశు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆశాలకు కిల్కారీ మొబైల్ అకాడమీ శిక్షణ తరగతులు పూర్తిచేయించాలని, ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని నోడల్ అధికారులకు సూచించారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ కె.పద్మావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి ఐడిసిఎఫ్ కార్యక్రమం గురించి వివరించారు. జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సస్ అధికారి డాక్టర్ సురేఖ, డాక్టర్ నందిగం సురేష్ ఆశాల మొబైల్ యాప్‌ల గురించి, కిల్కారీ మొబైల్ అకాడమీ గురించి శిక్షణిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ పద్మజారాణి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - నరసరావుపేట

మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శిలు సిలార్ మసూద్, ఈవూరి మస్తాన్‌రెడ్డి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు, హెల్త్ అలవెన్సులు జీతంతో కలిపి ఇవ్వాలని కోరారు. నరసరావుపేట మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందర్నీ ఆప్కాస్‌లో చేర్చి రెగ్యులర్ కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు ఇవ్వాలని, ఇఎస్ఐ కార్డులు మంజూరుతోపాటు వేతనంతో కూడిన వారాంతపు సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు టి.మల్లయ్య, డి.యోహాను, కె.కమల కుమారి, సాల్మన్, పి.ఏసు, రమణ, సురేష్, ఐజాక్‌బాబు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నకిలీ విత్తనాలు, ఎరవులు విక్రయిస్తున్నారన్న సమాచారంపై ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. స్టాక్ రికార్డ్స్, ఫార్మ్స్ తనిఖీ చేయాలన్నారు. ఫార్మ్‌లో ఉన్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేని కల్తీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది ఫెర్టిలైజర్స్ దుకాణదారులు అనధికారికంగా కొని నిల్వ ఉంచే గోడౌనంలలో నకిలీ ఎరువులు, విత్తనాలు నిలువ వుంచి అవకాశం ఉంటుందన్నారు. రైతుల నుండి ఆ ఫర్టిలైజర్ షాపుకు సంబంధించిన గోడౌన్‌ల యొక్క సమాచారం తెలుసుకొని వాటిపై దాడులు చేయాలని ఎస్పి సూచించారు.

రూ.425 కోట్ల సెస్ వసూలు లక్ష్యం

పశువుల సంత, చెక్‌పోస్టు ఏర్పాటుకు పరిశీలన : మార్కెటింగ్ శాఖ ఆర్‌జెడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

2023-2024 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ సెస్ వసూలు లక్ష్యం రూ.425 కోట్లుగా నిర్ధారించినట్లు మార్కెటింగ్ శాఖ విజయవాడ రీజియన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన గురువారం సందర్శించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సెస్ వసూలు రూ.365 లక్ష్యం కాగా రూ.388 కోట్లు వసూలైనట్లు తెలిపారు. విజయవాడ రీజియన్‌లో 83 మార్కెట్ యార్డులు వున్నాయని, వీటిలో 5.70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 580 గోదాములు ఉన్నాయని, 1.60 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 199 గోదాములు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వీటిని నామమాత్రపు అద్దె ప్రాతిపదికన పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు రైతులకు ఇస్తామన్నారు. రైతుల నుంచి వసూలు చేసిన మార్కెట్ ఫీజును యార్డులో మౌలిక సదుపాయాలకు ఖర్చుపెడుతున్నామని చెప్పారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత ఏర్పాటుకు స్థలాన్ని అన్వేషిస్తున్నామని, అచ్చంపేట రోడ్డులో చెక్‌పోస్టు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఆయనవెంట మార్కెట్ యార్డు చైర్మన్ పి.బాబురావు తదితరులున్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తెరగాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

తయారు చేసిన ప్రాజెక్టులతో విద్యార్థులు, ప్రిన్సిపాల్

మానవ మనుగడకు సకల జీవరాసులకు ప్రాణాధారమైన నీటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కృష్ణవేణి డిగ్రీ కలశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, ఎడ్యుకేట్ ది సొసైటీ సంయుక్త ఆధ్వర్యములో స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో నీరు పరిరక్షణపై అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాతాని మాట్లాడుతూ నీటి సంరక్షణ వ్యూహాలు, పరిష్కార మార్గాలపై నిపుణులు పరిశోధనలు చేయాలన్నారు. పంటలకు అవసరమైన సాగు నీటి కొరత అధిగమించేందుకు వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, నేలలో తేమను మెరుగుపరచడానికి అనేక పద్ధతులు ఉన్నాయని వివరించారు. మల్చింగ్, బిందు సేద్యం విధానంలో పంటలు పండించడం, చెట్లను నాటడం, పాలిథిన్ షీట్‌ల ద్వారా మంచును ఉపయోగించడం వంటి సమర్ధవంతమైన నీటి పారుదల వ్యవస్థల వలన పంటలకు నీటి వినియోగం తగ్గుతుందని చెప్పారు. మిగులు ప్రాంతాల నుండి నీటిని లోటు ప్రాంతాలకు కాలువల ద్వారా అనుసంధానించే చర్యలపై భావి ఇంజినీర్‌లు దృష్టి సారించాలన్నారు. తగ్గిన వర్షపాతం, మానవ నిర్మిత వాతావరణ మార్పులు, భూగర్భ జలాల స్థాయి తగ్గుదల, జనాభా పెరుగుదల, వినియోగదారుల నిర్లక్ష్యం దేశ ఆర్థికాభివద్ధిలో నీటి ప్రాముఖ్యతను దెబ్బతీయకూడదన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేట్ ది సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ షేక్ అన్సారీ, కృష్ణవేణి డిగ్రీ కళాశాల ట్రైనింగ్, ప్లేసెమెంట్ కోఆర్డినేటర్ ఎం.బాలకోటేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ అప్పలరాజు, జి.రమణ, వినయ్ కుమార్, అప్సర, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై 19న ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

కోసం మంగళగిరి మండలం ఆత్మకూరులో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులతో నిర్వహించిన సమావేశానికి బి.రాంబాబు అధ్యక్షత వహించగా డి.రామారావు, సిహెచ్.సీతారామాంజనేయులు, వి.రామారావు, సిహెచ్.జనార్ధన్‌రావు, ఆనందం బాబ్జి, యు.దుర్గారావు, ఎం.శ్రీనివాసరావు, జి.లక్ష్మి, బి.సీతా మహాలక్ష్మి, ఎస్.రాధా పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సాయి నుంచి ఐదు కిలోల గంజాయిని కొనుగోలు చేసిన రషీద్‌కు, రూరల్ గ్రామం పెదరావూరుకు చెందిన గంజాయికి బానిసైన కోటంరాజు కామేశ్వరరావుద అలియాస్ కాశితో పరిచయమైంది. అతనికి కిలో గంజాయిని విక్రయించాడు. మరో కిలో గంజాయి కావాలంటూ రషీద్‌కు కాశి ఫోన్ చేశాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న రూరల్ సిఐ కె.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు నిఘా పెట్టారు. రెండు సంచుల్లో కిలో చొప్పున గంజాయి విడివిడిగా ప్యాక్ చేసుకుని సంగంజాగర్లమూడి లాకులు తూర్పు వైపునకు రషీద్ వచ్చాడు. అనంతరం కాశీకా ఫోన్ చేసి పిలిపించుకున్నాడు. వారిద్దరూ అక్కడికి చేరుకోగానే సమీపంలో మాటు వేసిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.21 వేల విలువైన 2.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మూడో ముద్దాయిగా ఉన్న సాయి అలియాస్ వంటల నాగేంద్రను అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ చెప్పారు. నిందితులు గంజాయిని విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. గత మూడు నెలల వ్యవధిలో రూరల్ పరిధిలో నాలుగు గంజాయి కేసులు నమోదు చేసి, ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ కె.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ పి.మణికుమార్, టి.శ్యామలరావు, పిసిలు పి.శ్రీనివాసులు, ఎం.రాము పాల్గొన్నారు.

యు1 జోన్‌పై మళ్లీ అలజడి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను కలిశారు. అయితే రైతులకు నష్టదాయకంగా ఉన్న యు1 రిజర్వ్ జోన్ ఎత్తివేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దీనిపై చొరవ తీసుకోవాలన్నారు. ఈ భూములపై ఆధారపడ్డ సన్న, చిన్నకారు రైతులు రెండు శాతం పన్ను కట్టలేని పరిస్థితిలో ఉన్న దృష్ట్యా అవసరమైతే సిఎంతో మాట్లాడి ఎటువంటి చెల్లింపులూ లేకుండా జోన్ ఎత్తివేయడానికి కృషి చేయాలని కోరారు.

యు1 జోన్‌పై మాట తప్పిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి, కొలనుకొండ, కుంచనపల్లి రైతుల భూములపై విధించిన యు1 రిజర్వ్ జోన్‌పై స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట తప్పారని టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు విమర్శించారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు శాతం చెల్లించాలన్న సిఆర్‌డిఎ నిర్ణయంపై స్థానిక ఎమ్మెల్యే, వైసిపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఈ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా కట్టకుండా నారా లోకేష్ జోన్‌ను రద్దు చేస్తారని అన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మహాలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, ఎ.మురళీ, వేణుగోపాలరెడ్డి, కోట సాంబశివరావు, డి.మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో విజయావకాశాలకు 'కత్తెర'

తుళ్లూరులో వైసిపి నాయకుల అసమ్మతి

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పై కొంతమంది నాయకులు,కార్యకర్తలు అసమ్మతి గళం వినిపించారు.తమకు తెలియకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ విజయావకాశాలకు 'కత్తెర' వేస్తున్నారని విమర్శలు గుప్పించారు.దొండపాడు గ్రామానికి చెందిన కొప్పుల శేషగిరిరావును వైసిపి మండల అధ్యక్షులుగా ప్రతిపాదిస్తూ అధిష్టానానికి సిఫారసు చేశా రంటూ కత్తెర సురేష్ కుమార్ పై మండిపడుతున్నారు. శేషగిరిరావు పేరు ప్రస్తావించకుండా సురేష్ కుమార్ పై విమర్శలు గుప్పించారు. సురేష్ కుమార్ ఒంటెద్దు పోకడతో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం తుళ్లూరు ఎస్సీ కాలనీలో వైసిపి నాయకులు కంతేటి చిన్న వెంకటేశ్వర్లు ఇంటిలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు.సమావేశంలో వైసిపి నాయకులు నాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ,పార్టీలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించి అధిష్టానానికి నివేదించాల్సిన పరిశీలకులు బ్రహ్మానందరెడ్డి సురేష్ కుమార్ వెంట తిరుగుతున్నారని,ఫోన్ చేస్తే కనీసం స్పందన లేదని అన్నారు. అటువంటి వ్యక్తులతో ఎలా రాజకీయం చేయగలం..అని ప్రశ్నించారు. ఎవరికీ తెలియకుండా తమకు ఇష్టమైన వారికి పదవులు కట్టబెడితే పదవి పొందిన వ్యక్తి కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎలా పని చేయగలడని ప్రశ్నించారు. శాఖమూరు గ్రామానికి చెందిన జొన్న కూటి... మాట్లాడుతూ,గతంలోనూ గ్రామ సచివాలయం కన్వీనర్లు,గహ సారథుల నియామకంలోనూ ఏకపక్షంగా వ్యవహరించారని అన్నారు. పార్టీకి పని చేయని వారిని,సస్పెండ్ అయిన వారిని వెంట బెట్టుకొని తిరుగుతూ నిజమైన కార్యకర్తలను పక్కన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేయకుండా ఉన్న వారిని కాదని తమకు ఇష్టమైన వారిని నియమించడం సబబు కాదన్నారు.కాకర్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ,ఎమ్మెల్యే శ్రీదేవి గ్రామాల్లో గ్రూపులను ప్రోత్సహించి పార్టీకి నష్టం వాటిల్లేలా వ్యవహరించారని,సమిష్టి నిర్ణయాలతో ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందన్నారు. వెంకటపాలెంకు చెందిన గాదె నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏకపక్ష నిర్ణయాలు పార్టీకి చేటన్నారు.మండల కమిటీ అధ్యక్షుని ఎంపికలో కార్యకర్తలు,నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం మంచిది కాదన్నారు. రెండు రోజుల్లో పార్టీ అధిష్టానాన్ని కలిసి అన్ని విషయాలను వివరిస్తామన్నారు. అధికారంలో లేనప్పుడు పార్టీ కార్యక్రమాలకు 200 మంది వచ్చేవారని,ఇప్పుడు 100మంది కూడా రావడం లేదని చిన్న వెంకటేశ్వర్లు,పొన్నూరి నాగేశ్వరరావు అన్నారు.తక్షణమే మండల సమావేశం నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా పార్టీ మండల అధ్యక్ష పదవి పై నిర్ణయం తీసుకోవాలని కోరారు.సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుళ్లూరులో సమావేశమైన వైసిపి నాయకులు, కార్యకర్తలు

నిప్పు రవ్వలు పడి ఆటో దగ్ధం

ప్రజాశక్తి - అచ్చంపేట

ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల నుండి నిప్పు రవ్వల పడి ఆటో దగ్ధమైన సంఘటన గురువారం మధ్యాహ్నం అచ్చంపేటలో చోటు చేసుకుంది. గుంటూరుకు చెందిన తాళ్లూరి గోవర్ధన్ తన బంధువులను పలకరించేందుకు అచ్చంపేటలోని పంచాయతి కార్యాలయం రోడ్డులో ఉన్న వారి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆటోను రోడ్డు పక్కగా నిలిపి వారి ఇంటికి వెళ్ళాడు. అదే సమయంలో విద్యుత్ తీగల నుండి వచ్చిన నిప్పురవ్వలు ఆటోపై పడటం, మంటలు వ్యాపించడం క్షణాల్లో జరిగిపోయింది. ఆ దారిన వెళ్లే వారు బకెట్లతో నీళ్లు పోసి మంటలు ఆర్పేశారు. బంధువుల ఇంటి నుండి వచ్చిన గోవర్ధన్ తన ఆటో వద్దకు రావడంతో చుట్టుపక్కల వారు జరిగిన విషయాన్ని అతనికి చెప్పారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలిని కాపాడిన ఏఎస్సై

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలోని కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడబోతున్న వృద్ధురాలిని అమరావతి ఏఎస్సై కె.శ్రీనివాసరావు గురువారం కాపాడారు. ఎన్టీఆర్ జిల్లా గుజ్జూరు గ్రామానికి చెందిన వృద్ధురాలి అంజమ్మ,కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది అమరావతి శ్రీఅమరలింగేశ్వర స్వామి గుడి వద్ద కృష్ణా నదిలో దూకేందుకు యత్నించింది. అక్కడ విధుల్లో ఉన్న శ్రీనివాసరావు ఇది గమనించి ఆమెను కాపాడారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె కుటుం బానికి సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ మణి కృష్ణ

ప్రజాశక్తి-అచ్చంపేట: అచ్చంపేట ఎస్సైగా సిహెచ్ మణి కృష్ణ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎవరైనా ఆటం కం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారిస్తానని చెప్పారు. అను మతులు లేకుండా ర్యాలీలు ధర్నాలు నిర్వహిస్తే కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్బిఐ ఎటిఎం వద్ద అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక నాగార్జున కళామందిర్ పక్కన ఉన్న ఎస్బిఐ ఏటీఎం వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది వెంటనే స్పందించిన బ్యాంకు సిబ్బంది ఫైర్ ఇంజన్ కు న వూాచారం ఇవ్వడంతో వచ్చిన ఫైర్ శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు జనరేటర్ పక్కనే ఉన్న మెయిన్ స్విచ్ బోర్డ్ లో మంటలు చెల్లవేగడంతో వైర్లు కాలిపోయాయి అదే రాత్రి సమయంలో అయితే పెద్ద నష్టం జరిగి ఉండేదని పగలు కావడంతో సిబ్బంది ఉండటంతో నష్టం జరగలేదని బ్యాంక్ అధికారులు తెలిపారు

గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఏపీ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా పట్టణానికి చెందిన 9వ వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	48,486
మిర్చి ఎగుమతి	46,292
మిర్చి నిల్వ	13,480

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,500 - 23,000
నెం.5	10,500 - 22,000
273	10,000 - 21,000
341	10,000 - 21,500
4884	13,000 - 15,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 24,500
బడిగె	10,000 - 23,000
దేవనూరు డీలక్స్	11,000 - 18,500
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	13,000 - 23,500
నెం.5	15,000 - 15,000
341	15,000 - 23,000
తేజ	10,000 - 24,000
బడిగె	20,000 - 23,500
తాలుకాయలు	8,000 - 13,500

బహిరంగ ప్రకటన

గుంటూరు సిటి, గుంటూరు వారి తోట, 5వ లైను, డోర్.నెం.13-06-21 కాపురస్తులు వక్కలగడ్డ ఫణిమూర్తి గారి భార్య వక్కలగడ్డ శిరీషవల్లి గారికి వారి తల్లి గారు అయిన వూటుకూరి కళ్యాణి గారు ద.నెం:-7174/2014 దఖలు దస్తావేజు ద్వారా డి.నెం:-1143/2014లో 176-1/9 గజాలు బహుమతిగా రిజిస్ట్రేషన్ నాకు చేసియున్నారు. అయితే అసలు దస్తావేజు ఎక్కడో పోయింది. గుంటూరు నల్లపాడు పోలీస్‌స్టేషన్ వారు ది.4-10-2020 డాక్యుమెంట్లు మిస్సింగ్‌పై సర్టిఫికెట్ ఇచ్చినారు. అయితే నా క్లయింటు అయిన చేరెడ్డి రవికుమార్ తండ్రి (లేట్) వెంకట సుబ్బయ్య ఈ స్థలంను కొనుగోలు చేయుటకు సిద్ధపడినాడు. ఈ స్థలంనకు సంబంధించి ఏటువంటి పేచిలు, గొడవలు వున్న 7 రోజుల్లో తెలియజేయగలరు. లేని యెడల నా క్లయింట్ తీసుకోను చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

ఇట్లు
కొమ్మ రమేష్,బి.ఎ., యమ్.ఎల్.,
న్యాయవాది,
3వ లైను, గుంటూరు వారి తోట,
గుంటూరు-522001. సెల్.నెం.9440613392

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు నందు గురజాల
ఓ.యస్.నెం. 46/2021

బిట్వీన్ :
దుగ్గెంపూడి ఇన్నారెడ్డి ...వాది
వర్సెస్
తమ్మా కస్పారెడ్డి ... ప్రతివాది
టు,
తుమ్మా కస్పారెడ్డి, తండ్రి : లేటు ఇన్నారెడ్డి, కన్వర్టెడ్ క్రిస్టియన్, 58 సంll లు, మిర్చి వ్యాపారం, ఆర్/ఓ, గోల్డెన్ టవర్స్, జూట్‌మిల్ ఎదురు, కృష్ణనగర్, గుంటూరు, గుంటూరు సిటీ & జిల్లా.

మీపై వాది పై నెంబరు దావా నోటు బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా, శ్రీ కోర్టువారు మీకు సమన్లు జారీ చేయుటకు ఎన్నిమార్లు ఆర్డరు వేసిననూ, మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయునదేమనగా ది. 26-6-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా వకీలుగారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలను తెలియజేయని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

ఇట్లు
చల్లా రామిరెడ్డి,
ఎన్.శ్యామలాదేవి,
వాది తరపు న్యాయవాదులు,
సెల్ : 94414 09796

ప్రకటన

మా క్లయింట్ అయిన వేముల సాంబశివరావు S/o కోటయ్య, ప్రకాష్ నగర్, నరసరావుపేట వారి వలన సమాచారం పొంది యావన్మందికి తెలియ జేయునది ఏమనగా,

దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిని మా క్లయింట్ (లేటు) పెరుమాళ్ల నారాయణరావు గారి భార్య పేరు పెరుమాళ్ల వెంకటరత్నం వగైరాల వలన 108.07 చ॥గ॥ల స్థలం, ది. 13-03-2020 వ తేదీన ద.నెం 4058/2020 నరసరావుపేట S.R.O గా విక్రయం పొందియున్నారు.తిరిగి అదే దినమున కొత్తా విశ్వనాథం గారి జిపిఏ ఏజెంట్లు 1) తాటికొండ లక్ష్మీప్రసాద్, 2) కొప్పురావూరి శ్రీనివాసరావు గారి వలన 12.03 చ॥గ॥ స్థలం, ద.నెం.4059/2020 S.R.O నరసరావుపేట గా విక్రయం పొందియున్నారు. పైన తెలిపిన సదరు దస్తావేజులు లింకు దస్తావేజులు అయిన ద.నెం. 180/1990 మరియు 181/1990 యొక్క ఒరిజినల్ దస్తావేజులు మా క్లైంట్ అయిన వేముల సాంబశివరావు ప్రకాష్ నగర్ లోని వారి ఇంటి వద్ద నుండి రిజిస్టర్ ఆఫీసుకు తీసుకోవచ్చు సమయంలో ఆ దస్తావేజులు మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినవి. కావున పైన తెలిపిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల నాకు కానీ నా క్లయింట్ కు కానీ ఒక వారం రోజుల్లోపు అందజేయ కోరుచున్నాము.

మరియు పైన తెలిపిన దస్తావేజులపై మరియు దానిపైన జరిపిన లావాదేవీల పైన ఎటువంటి రుణములు లేవని ఎవరికి ఎటువంటి అన్యాకృతం చేయలేదని తెలియపరచడమైనది.

తేది.16-06-2023. ఇట్లు.
ముప్పాళ్ల రవికాంత్,B.Com, BL.
S.రామహనుమంత రెడ్డి,B.Com, LLB.
స్టేషన్ రోడ్, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
Cell.No:- 9440213550, 7306168563.

ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్థిని కొమ్మెర గోవిందు గారి కుమారుడు పుల్లయ్య తన భార్య అయిన రాజేశ్వరికి ది.7-04-2011న దఖలు పరిచి యున్నాడు. ఈ ఆస్థిని కుర్రి సూరారెడ్డి గారి కుమారుడు వెంకట సుబ్బారెడ్డి ది. 9-01-2013 న కొనుగోలు చేసియున్నారు. సదరు ఆస్థిని 1) కొండా వెంకటేశ్వర్లు గారి కుమారుడు శేషు, 2) చిక్కాల ఆనందరావు గారి కుమారుడు రమేష్ బాబు ది.9-04-2021 న కొనుగోలు చేసియున్నారు. ఇద్దరు జాయింట్ గా కొనుగోలు చేసిన ఆస్థిని కొండా శేషు ది. 28-03-2022 న చిక్కల రమేష్ గారికి ఒక హక్కు విడుదల దస్తావేజు వ్రాయించి ఇచ్చి ఉన్నారు. ది.1-08-2022 వ తేదీన సదరు దాఖల ఆస్థిని చిక్కాల రమేష్ గారు యెండూరి చెన్నయ్య గారి భార్య విజయ గారికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వ్రాయించి యున్నారు. ఈ షెడ్యూల్ దాఖల ఆస్థిని నా క్లైంట్ అయిన బలదేవ్ ప్రసాద్ గారి కుమారుడు దివాకర్ సందీప్ కుమార్ కొనదలచి యున్నారు. కావున షెడ్యూల్ దాఖల ఆస్థి పట్ల ఎవరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల ఈ పేపర్‌లో ప్రకటన వెలువడిన రోజు నుండి వారం రోజులు లోపల ఆక్షేపణలు తెలియ పరచగలరు. తెలియ పరచనియెడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ కొనబడును.

షెడ్యూలు:- నరసరావుపేట మున్సిపల్ లిమిట్స్ లోని సత్తెనపల్లి రోడ్డులో గల బరంపేట పాత వార్డు నెం.1, కొత్త వార్డు 10. T.S NO 1/1A,
D.No. 1-19-143/A.
తూర్పు:- కొమెర శంకరరావు గారి స్థలం హద్దు. 14 అడుగులు.
దక్షిణం:- చెట్టుపల్లి రామారావు గారి స్థలం హద్దు 32 అడుగులు.
పడమర:- మున్సిపల్ బజార్ 14 అడుగులు.
ఉత్తరం:- మున్సిపల్ బజార్ 32 అడుగులు ఈ 4 హద్దుల మధ్య చ.గ 49.77 ఖాళీ స్థలం.

ఇట్లు.
కె.బుచ్చిదంతాచారి, న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
Cell.No 9441655377.

దస్తావేజులు పోయినవి

నేను అనగా కంది అరుణ భర్త : రామిరెడ్డి, బొల్లవరం గ్రామం, ముప్పాళ్ల మండలం, గుంటూరు జిల్లా. నేను నా భర్తతో కలిసి నా భూమికి సంబంధించిన దస్తావేజులు 10918/2014, 10917/2014, 10916/2014, 2967/2018 లను తీసుకొని బొల్లవరం నుండి ముప్పాళ్ళ బైకుపై వెళుచుండగా ఈ దస్తావేజుల కవరు జారిపోయినది. తదనంతరం ఎంత వెదికినా కనపడలేదు. ఈ దస్తావేజుల కవర్‌ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ఇట్లు
కంది అరుణ.
బొల్లవరం గ్రామం, ముప్పాళ్ళ మండలం,
పల్నాడుజిల్లా. సెల్ : 9985468663.

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.
O.S.No.451 of 2021

Between:
Union Bank of India,
[A Govt. of India undertaking]
[formerly]Andra Bank rep.by its Manager,
Credit Card Division Head Office, Koti,
Sultan Bazar, Hyderabad.
...Plaintiff.

And

Mr.M.Pamula Reddy,
S/o Mr.M.Venkta Subba Reddy,
Aged about 43yrs, Occ: Business,
H.no.25-10-78/B, 3rd Lane,
Srinivasa Rao Thota, Guntur – 522004.
.Defendant

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 451 of 2021 on the file of Hon'ble XXI Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 3,68,729.47 pertaining to your credit card no ending with -6001. You are therefore directed to appear in person or through Advocate on 7.7.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli,Hyderabad.
Cell:98496-66587

మంత్రి అండతో పేకాట క్లబ్‌లు : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జూదం, మద్యం, బెట్టింగ్‌లు, అరాచకాలు, దండాలు వంటి వాటికి చిలకలూరిపేటను అడ్డాగా వైసిపి నేతల మార్చారని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. మంత్రి రజిని అండదండలతో ఆమె కుటుంబీకులే జూదం మాఫియాను పోషిస్తున్నారని అన్నారు. ఈ మేరకు స్థానిక తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అపార్ట్‌మెంట్లలో, బజార్లలో పేకాట నడుస్తోందని, రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. వీటిద్వారానే మంత్రి రజిని రూ.కోట్లు సంపాదిస్తున్నారని, పేకాట క్లబ్‌లకు మద్యం సహా అన్నీ సరఫరా చేస్తున్నారని విమర్శించారు. సీనియర్ సిటిజన్స్ ఆడుకునే క్లబ్‌లు మూసేసి అనధికారికంగా పేకాట క్లబ్‌లు తెరిచారని, సీఎం జగన్, మంత్రి రజిని పుణ్యాన ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. చిలకలూరిపేటలో జరుగుతున్న ఈ తతంగం ఎస్ఇబి, పోలీస్‌శాఖకు కనిపించట్లేదా? అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. బెల్టు షాపులను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని, లింగరావుపాలెం, సొలస, మధ్య రోడ్డు ప్రక్కనే వైన్స్ షాపునకు అనుమతివ్వడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా జూదం నియంత్రణకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమలేస్తున్న గుండాల రాకేష్ తదితరులు

శ్రీశ్రీకి ఘన నివాళులు

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక పనసతోటలోని శ్రీ విద్యా వికాసిని ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రాకేష్ మాట్లాడుతూ శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం ఎంతోమందిని కదిలించిందని, ఆయన రచన శైలి ఎంతోమందికి ఆదర్శమైందని చెప్పారు. యువ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గుర్రం జాషువా ప్రభుత్వ అవార్డు గ్రహీత డాక్టర్ కె.ప్రతాప్ స్థాపించిన శ్రీశ్రీ కళా వేదిక ద్వారా ఇప్పటివరకు 117 జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు, 40 రంగస్థల కళా ప్రదర్శనలు, 30 పుస్తక ప్రచురణలు, 40 సాహిత్య సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయంగా కమిటీలు వేసి కువైట్, దుబాయి, మలేషియా, అమెరికా దేశాలలో సాహిత్య కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో లిమ్రా ఇనిస్ట్యూట్ డైరెక్టర్ షేక్ కరిముల్లా, జిల్లా యూత్ అధ్యక్షులు పటాన్ కరిష్మా, అమర్, సఫ్రినిసా, వినోద్, జీవరత్నం, దేవకిరణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులతో నేడు ముఖాముఖి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట మున్సిపల్ అతిథి గృహంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జర్నలిస్టులతో ముఖాముఖి, సీనియర్ జర్నలిస్టులకు సన్మాన ఉంటుందని సి.రాఘవాచారి మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హాజరవుతారని పేర్కొన్నారు.

పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

పిడుగురాళ్ల

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పారిశుధ్య పనుల్లో కీలకమైన తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం శానిట ఇన్‌స్పెక్టర్ రమాదేవి వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పని చేసిన కార్మికులను కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విస్మరిస్తోందని అన్నారు. తాను అధికారంలోకి వస్తే కాంటాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడేందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంటాక్ట్, ఎన్ఎంఆర్, ఇంజినీరింగ్ విభాగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ స్లిప్పులు, సబ్బులు, నూనెలు, యూనిఫామ్ చెప్పులు వెంటనే ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో తడి చెత్త, పొడి చెత్త క్రింద తీసుకున్న కొత్త కార్మికులను వెంటనే కాంటాక్ట్ కార్మికుల్లో కలపాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎంఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలని కోరారు. ధర్నాలో ఎం.ప్రతాపం, కె.సీతారామయ్య, బి.రామారావు, డి.లక్ష్మి, అనంతరాములు, గంగమ్మ, పార్వతి, సుజాత, ఇంజినీరింగ్ విభాగ కార్మికులు రాజు, షేక్ సుబానీ, కె.శ్రీను, వెంకయ్య, రమేష్ పాల్గొన్నారు.

మాచర్ల

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పురపాలక సంఘంలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్మికుల సమస్యలను సిఐటియు నాయకులు మహేష్ వివరించారు. రమణ, శోభన్ కుమార్, వి.వెంకట్రావు పాల్గొన్నారు.

బిల్లులు సరిగా రావు.. పనులు పూర్తికావు..

అసంపూర్తిగా నాడు-నేడు పనులు - విద్యార్థులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

పట్టణంలోని శారదా హైస్కూల్‌లో చేపట్టిన నాడు-నేడు రెండో దశ కింద చేపట్టిన అభివృద్ధి పనులు సగమైనా పూర్తవ్వలేదు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి మరో 10 నెలలు పట్టే అవకాశం కనిపిస్తోంది. బడులను తెరిచే నాటికి పనులన్నీ పూర్తి చేయాలనేది లక్ష్యంగా కాగా దాన్ని చేరుకోలేదు. పైగా నిర్మాణ సామగ్రి పాఠశాలల్లో అడ్డదిడ్డంగా పడి పాఠశాల నిర్వహణకు అసౌకర్యంగా మారింది. ఈ పాఠశాలలో ఆరో తరగతిలో కొత్త 350-400 మంది చేరతారని అంచనా కాగా వీరితో కలిపి పాఠశాల విద్యార్థుల సంఖ్య 1500-1600 వరకు ఉంటుంది. ఈ పాఠశాలకు ఇప్పటికే 28 తరగతి గదులు ఉండగా మరో 18 గదుల నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మరో రెండు ఫ్లోర్‌లుగా నిర్మిస్తున్నారు. అయితే మొదటి ఫ్లోర్ శ్లాబ్ దశ వరకే పనులు పూర్తయ్యాయి. రెండోఫ్లోర్ నిర్మాణమేమీ మొదలు కాలేదు. గతంలో రెండు మరుగుదొడ్లు ఉండగా వీటిల్లో ఒకటి మరమ్మతుకు గురైంది. కొత్తగా రెండు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా అవీ పూర్తవ్వలేదు. బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడమే పనుల్లో జాప్యానికి కారణమని పేరెంట్స్ కమిటీ చెబుతోంది. పుస్తకాలను ఇంకా పంపిణీ చేయలేదు. ఆర్‌వో ప్లాంట్ నిర్వహణ సరిగా లేక తాగునీటి కోసం బోరుపై విద్యార్థులు ఆధారపడుతున్నారు. ఇదంతా ఒకెత్తయితే డిజిటల్ విద్య అంటూ ప్రభుత్వం హడావుడి చేస్తుండగా ఈ పాఠశాలలో ఒక్కటి కూడా ఇన్‌స్టాల్ చేయలేదు.

ఐదేళ్లుగా టిఏ బిల్లులివ్వలేదు

నెలల తరబడి సెంటర్ అద్దెలు, కూరగాయల బిల్లుల పెండింగ్

సమస్యలపై అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని అంగన్వాడి కేంద్రంల్లో సమస్యల పరిష్కారం కోసం ఇన్‌ఛార్జి సిడిపిఒ జోష్నాకు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018 నుండి టీఏ బిల్లులు రావడంలేదని, సెంటర్ అద్దెలు, కూరగాయలు బిల్లులు నెలలు తరబడి పెండింగ్లో ఉంటున్నాయని చెప్పారు. ఎప్పుడో ఇచ్చిన పాత వంటపాత్రలతో వంట చేయాల్సి వస్తోందని, వంట పాత్రలు, కుర్చీలు, బల్లలు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. వైఎస్ఆర్ పోషణ మెనూ ఛార్జీలను పెంచాలని, ఎండ తీవ్రతంగా ఉన్న కారణంగా అంగన్వాడి సెంటర్‌ను ఎనిమిది గంటల నుండి 11:30 వరకు జరిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ ఎబి సరస్వతి, సుభాషిణి, అరుణ, వాణి, విజయ రాణి, జయ కుమారి, కె.శివకుమారి, సఫియా పాల్గొన్నారు.

పది, ఇంటర్ అణిముత్యాలకు ప్రోత్సాహకాలు

రెంటపాళ్లలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, మెడల్స్ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ కంటే అధికంగా ఉత్తీర్ణత సాధించారని, వారిని ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని రెంటపాళ్ల జెడ్‌పి పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. మంత్రి మాట్లాడుతూ ఏ విద్యార్థీ పేదరికంతో చదువుకు దూరం కాకుండా ఉండేందుకే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, వనరులు కల్పించి మెరుగులు దిద్దామని, అభివృద్ధి చర్యలతో విద్యార్థుల చేరిక, హాజరు కూడా పెరిగిందని చెప్పారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఏడాదిలో ప్రథమ స్థానంలో నిలిచిన నాలుగు గ్రూపుల్లో నలుగురు విద్యార్థులకు పురస్కారాలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాజనారాయణ, పాకాలపాడు సొసైటీ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఇఒ జఫ్రుల్లాఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీరాములు మాట్లాడుతూ నియోజకవర్గంలో 3522 మంది విద్యార్థి పరీక్షలు హాజరు కాగా 2573 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వినుకొండ మండలంలో 954 మంది విద్యార్థులకు 630 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారిలో 553 మార్కులు పైగా వచ్చినవారు 45 మంది ఉన్నారని తెలిపారు. ఇంటర్ ఎంపీసీలో ధనలక్ష్మి, బైపీసీలో కొంద్రు జ్యోతి, సీఈసీలో బీ. చైతన్య, హెచ్‌ఈసిలో పల్లె పవన్ ఉత్తమ ప్రతిభ కనపరచగా ఒక్కొక్కరి రూ.15 వేల ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే అందించారు. పదవ తరగతిలో ప్రథమ బహుమతి జి.వెంకటేష్‌కు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రోహిత్ కుమార్‌రెడ్డికి రూ.10 వేలు, తృతీయ బహుమతి సుష్మ, ప్రేమ్‌సాగర్‌కు రూ.5 వేలు చొప్పున అందించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు.

తాడేపల్లిలో

మాట్లాడుతున్న బాబుప్రసాద్, హుస్సేన్‌వలి

మున్సిపల్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. కార్మికులకు సంవత్సరం తరబడి పెండింగ్‌లో ఉన్న చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె ఇతర రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడేపల్లి మున్సిపల్ జోన్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. ఒపిఎస్‌ను అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్, పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కొండయ్య, సతీష్, నాని, కామాక్షి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి:

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మిక చట్టాలు అమలు కావటంలేదని, కార్మికుల సమస్యలూ పరిష్కారానికి నోచుకోవటంలేదని సిఐటియు జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ అన్నారు. ఏపి మున్సిపల్ ఎంప్లాయీస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాపితంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా గురువారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన చేపట్టారు. నిరసన దీక్షను బాబు ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు, వారి కుటుంబాంబలకు ఉపకరించే ఈఎస్ఐ చట్టం అధికారులు అమలు చేయటం లేదన్నారు. అలాగే కనీస వేతన చట్టం, ఈపీఎఫ్ చట్టం, గ్రాట్యుటీ చట్టం ఎంతో పటిష్టంగా ఉన్నా, వాటిని ప్రభుత్వాలు అమలు చేయటంలేదన్నారు. ఫలితంగా లక్షలాది మంది కార్మికులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.పద్మ, మంగళగిరి వెంకటేశ్వర్లు, కె.సుశీల, కె.సరళారాణి, వి.లక్ష్మినారాయణ, డి.దుర్గాప్రసాద్, సిహెచ్ వెంకాయమ్మ, ఎన్.ఆదాం, జి.తిరుపతయ్య, మేరిబాబు, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీధి దీపాల సమస్య రాకుండా చూడాలి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు నగరంలో వీధి దీపాల సమస్యలు రాకుండా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు వస్తే జిఎంసి ఫిర్యాదుల కేంద్రానికి ప్రజలు తెలియజేయాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి దీపాల సమస్యలు రాకుండా వార్డు సచివాలయాల వారీగా ఎమినిటి కార్యదర్శులతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నగర ప్రజలు కూడా తమ ప్రాంతంలో వీధి దీపాల సమస్యలు ఎదురైతే వెంటనే జిఎంసి ఫిర్యాదుల కేంద్రంలోని 0863-2345103, 104,105 నంబర్లకు నేరుగా, 9849908391కు వాట్సాప్ చేయవచ్చని తెలిపారు. రానున్న వర్షాలను దష్టిలో ఉంచుకొని మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ మేరకు పూడికతీత పనులు పక్కగా జరగాలన్నారు. నాడు-నేడు పనులలో వేగం పెంచాలని, ఐలాండ్స్ పనులు కొన్ని చోట్ల నత్త నడకన జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేసి, తదుపరి సమీక్షా సమావేశం నాటికి పూర్తి అయ్యేలా చూడాలని ఈ.ఈ.లను ఆదేశించారు. ఎక్కడా త్రాగునీటి సమస్యలు రాకుండా ఏఈలు పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారిగా ఎమినిటి కార్యదర్శులు పైప్ లైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ వాటర్ శాంపిల్స్ తీయాలన్నారు. జగనన్న లేఅవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో జరగట్లేదని, వర్షాకాలంలోపు నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు పూర్తి కావాలని, నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్.ఈ. భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, ఏడిహెచ్ రామారావు, డిఈఈలు, శివ కుమార్, రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి, కళ్యాణరావు, హనీఫ్, రఫిక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు వై నేతాజీ ముత్యాలరావు తదితరులు

18న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో ఈనెల 18న జరిగే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర పర్మినెంట్ కాని ఉద్యోగులు, కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని జేఏసీ ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జిల్లా సెక్రెటరీ జనరల్ బి.ముత్యాలరావు పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించిందని, దీనివల్ల అతి కొద్దిమంది మాత్రమే రెగ్యులర్ అవుతారని అన్నారు. 2014 జూన్ 2 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో ఇచ్చిన హామీకి అనుగుణంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని అన్నారు. అలాగే సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకునేందుకు జరుగుతున్న ఈ రాష్ట్ర సదస్సులో గుంటూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఇతర పర్మినెంట్ కాని ఉద్యోగులు, కార్మికులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పాల్గొన్నారు.

రైల్వేలో భద్రతకు అధిక ప్రాధాన్యం

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైలు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్ చెప్పారు. గుంటూరు రైల్ మహల్‌లో గురువారం భద్రతా సదస్సులో మాట్లాడారు. రైల్వే పరంగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ద్వారా వివరించారు. ఆపరేటింగ్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ , మెకానికల్ తదితర విభాగాల భద్రతలపై చర్చించారు. ఇంటరాక్టివ్ స్టేషన్ లో ఫ్రంట్ లైన్ సిబ్బంది సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఫ్రంట్ లైన్ సిబ్బంది, సూపర్ వైజర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించి ఉన్న మార్గదర్శకాలు, నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి విధి నిర్వహణలో లోతైన అవగాహన ఉండాలని, ఎప్పటికప్పుడు ఆయా అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. డిఆర్ఎం కార్యాలయంలో సెక్షన్ కంట్రోలర్‌లు, బ్రాంచి అధికారులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి భద్రతపరమైన అంశాలపై చర్చించారు.డిఆర్ఎం ఎం.రామకృష్ణ, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం జిల్లా కార్యాలయంలో శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న నాయకులు

మహాకవి శ్రీశ్రీ సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. గురువారం బ్రాడిపేట, సిపిఎం జిల్లా కార్యాలయంలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యం యువతను ఉగ్రూత లూగించిందన్నారు. ప్రజలను పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటానికి ఊతం ఇచ్చిందన్నారు. ఆయన రచనలను, సాహిత్యాన్ని విస్తతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళాలన్నారు. శ్రీశ్రీ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన చేయాలని కోరారు.సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యం సమాజ మార్పునకు నాంది పలికిందని, సమకాలీన సమాజంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఆయన కవిత్వాన్ని ప్రజలకి అందించారన్నారు. కుల, మత, ప్రాంతీయ తత్వాలకు వ్యతిరేకంగా తన కవిత్వాన్ని, గళాన్ని ఎక్కుపెట్టారన్నారని అన్నారు. 'ఎముకలు కుళ్ళిన, వయస్సు మళ్ళిన సోమరులారా చావండి' అంటూ బాధ్యతారహితంగా వ్యవహరించే యువతను కార్యోన్ముఖులను చేయడానికి ప్రయత్నించారని, నూతన సమాజ నిర్మాణమే సమస్యల పరిష్కారానికి మూలమని శ్రీశ్రీ భావించారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మన్నవ హరిప్రసాద్, నరసింహారవు, ఈమని అప్పారావు, నళినీకాంత్, ఆదినికల్సన్, కె.శ్రీనివాసరావు, తాడికొండ నరసింహరావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కవిత్వం అజరామరం

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీశ్రీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

మహాకవి శ్రీశ్రీ కవిత్వం అజరామరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గురువారం శ్రీశ్రీ 40 వర్ధంతి సందర్భంగా బ్రాడీపేటలోని ఓ హోటల్లో ఆయన చిత్రపటానికి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి, పాత్రికేయులు బి.విల్సన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని కవులు, రచయితలు నేటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు అన్వయించి చూడాలన్నారు. తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ, జాషువాలను మేలవించి సరికొత్త ప్రయోగాలు చేయాలని కోరారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనా రాయణ మాట్లాడుతూ తెలుగు కవిత్వంలో మహాకవి శ్రీశ్రీ ప్రభావం కొనసాగుతూనే ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో కవులు ఎస్.ఎం.సుభాని, బుర్రి కుమార్ రాజ, వరయూరి మధు, గాయకుడు బాబురావు, ప్రజాసంఘాల నాయకులు నల్లపుల్లి లాంబరం మంచాల జోసెఫ్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మున్సిపల్ ఆర్‌డి తదితరులు

వార్డు సచివాలయ సిబ్బందికి ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు

పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వార్డు సచివాలయ సిబ్బందిలో వికలాంగులు, అనారోగ్య సమస్యలు, ఒంటరి, వితంతువులు, స్పౌజ్, మ్యూచ్‌వల్ కేటగిరీ ఉద్యోగులకు గురువారం స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ బదిలీలను మున్సిపల్ ఆర్‌డి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. నిబంధనల మేరకు సచివాలయ కార్యదర్శుల బదిలీలు చేపట్టాలను అధికారులకు సూచించారు. గుంటూరు నగరపాలక సంస్థ సహకారంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవపత్రాలు పరిశీలించి, బదిలీలు ప్రక్రియ చేపట్టారు. అనంతరం బదిలు పొందిన వారికి ధృవీకరణ పత్రాలు అందచేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు కౌన్సిలింగ్‌లో పాల్గొన్నారు.. బదిలీలకు వార్డు అడ్మిన్‌లు 11, శానిటేషన్ 6, వెల్ఫేర్ 17, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ 10, ప్లానింగ్ 6, ఎమినిటిస్ 13 మంది కార్యదర్శులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి. హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లులే కట్టలేకపోతుంటే.. పెనాల్టీలా!

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విద్యుత్ వినియోగదారులకు కరెంట్ బిల్లుల షాక్ ఓ వైపు, ఆలస్యంగా బిల్లులు చెల్లిస్తే పెనాల్టి కింద తీసుకునే ఛార్జి మరోవైపు. ఇవన్నీ కలిసి తడిసి మోపెడవుతుండటంతో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. మీటర్ రీడింగ్ తీసిన తేదీ నుంచి సుమారుగా 15 రోజుల లోపు విద్యుత్ బిల్లు కట్టాల్సి ఉంటుంది. గడువు దాటితే గృహవినియోగదారులకు రూ. 30, వ్యాపార సంస్థలకు అయితే రూ.150 పెనాల్టీగా చెల్లించాల్సి ఉంటుంది. అదే, 40 రోజులు(అం టే విద్యుత్ శాఖ వారు ఇచ్చిన మార్జి న్ రోజులుకలువుకుని) దాటితే గృహ వినియోగదారులు ఆ ముప్పై రూపాయలతో పాటు అదనంగా రూ.100, వ్యాపార సంస్థలు అయితే ఆ నూల యాబై రూపాయలతో పాటు అదనంగా రూ. 100 పెనాల్టీ కింద చెల్లించాలి. ప్రతి నెలా మీటర్ రీడింగ్ తీసుకునే తేదీ విషయంలో కూడా ఒకోసారి ఒకో విధంగా ఉంటోందని, దీంతో యూనిట్ల సంఖ్య పెరగడంతో శ్లాబ్ రేటు కూడా పెరిగిపోతోందని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా మీటర్ రీడింగ్ ను ఒకటి లేదా రెండు తేదీల్లో కచ్చితంగా తీయాలని, ఆలస్యంగా చెల్లించే విద్యుత్ బిల్లుకు పెనాల్టీ లేకుండా చూడాలని, పెంచిన విద్యుత్ చార్జీలను, యూజర్ ఛార్జిలను తగ్గించాలని వినియోగదారులు కోరుతున్నారు.

పెనాల్టీ లేకుండా చూడండి

ఎం.శ్రీనివాసరావు

విద్యుత్ బిల్లులు యూనిట్ల రేట్లు పెరిగిపోవడంతో కరెంట్‌ను బంగారం లాగా చూసుకోవాల్సి వస్తోందని పూలకొట్టు యజమాని ఎం.శ్రీనివాసరావు అన్నారు. సీజన్ లేని సమయంలో విద్యుత్ బిల్లులు భారంగా మారాయని, డబ్బులు లేక రెండు,మూడు నెలలోక సారి చెల్లిస్తుంటామని, పెనాల్టీ డబ్బులు కట్టలేక పోతున్నామని ,అది లేకుండా ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

భరించలేకపోతున్నాం..

చీరాల రోడ్డు పక్కన నివాస ముంటున్నా ఓ మహిళ మాట్లాడుతూ ప్రతి నెలా దాదాపు రూ.350 వచ్చే విద్యుత్ బిల్లు రూ.840 వచ్చిందని చెప్పారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు తోడు ఆలస్యమైతే చెల్లించాల్సిన పెనాల్టీలను భరించలేకపోతున్నామని అన్నారు. లాంతర్లు వాడదామంటే కిరోసిన్ ధర కూ డా మండి పోతోందని, లీటర్ వంద రూపాయలు చెబుతున్నారని తెలిపింది.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణపనుల పరిశీలన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక సాంబశివనగర్‌లో సుమారు రూ.95 లక్షల్లో నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న విధానం గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. సుమా రు 40 రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని కాంట్రాక్టర్ తెలిపినట్లు రఫాని చెప్పారు. మున్సిపల్ డిఈ రమణ, ఏఈ జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - అచ్చంపేట

మాగులూరి ఫౌండేషన్ అధినేత భాను ప్రకాష్ సహకారంతో అగ్నిప్రమాద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. మానవతా దృక్ప థంతో ఒక్కొక్క కుటుంబానికి బియ్యం, కూరగాయలు, పండ్లు, ఒక ప్యాకెట్ ఆయిల్, దుస్తులను ట్రస్ట్ కమిటీ సభ్యులు మాగులూరి హరిబాబు, కృష్ణారావు, కిరణ్‌లు బాధితులకు అందజేశారు. బాధితులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని పెదపాలెం టిడిపి నాయకులు కోరారు. మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, తక్షణమే విపత్తుల సహాయ నిధి నుండి ఒక్కొక్క కుటుంబానికి తాత్కాలిక ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.1 లక్ష మంజూరు చేసి ఆదుకోవాలని, అదే విధంగా రూ.5 లక్షలతో పక్కా గృహాలు నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



హజ్ యాత్రికులకు సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రకు వినుకొండ నుండి 11 మంది ముస్లింలు తరలి వెళ్లడం అభినందనీయమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. హజ్ యాత్రకు తరలి వెళుతున్న ముస్లింలను జీ.వి ఆంజనేయులు ఘనంగా సన్మానించి వారికి తేనేటి విందు ఇచ్చి ఆర్థిక సహాయంతో సాదరంగా హజ్ యాత్రకు సాగనంపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఆయిబ్ ఖాన్, టీడీపి నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జగనన్న శాస్వత భూ హక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఇక నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతు లకు సత్తెనపల్లి తహశీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. మండ లంలోని రెంటపాళ్ళ సచివాలయంలో రిజిస్ట్రేషన్ పై పంచా యతి కార్యదర్శికి తహశీల్దార్ సురేష్, సబ్ రిజిస్ట్రార్ దేవా నంద్‌లు గురువారం అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏకుల రోశయ్యకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దండోరా వేయించారు. కార్యక్రమంలో వీఆర్వో నరసింహారెడ్డి, పంచాయతి కార్యదర్శి,గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందచేస్తున్న తహశీల్దార్ సురేష్, సబ్ రిజిస్ట్రార్ దేవానంద్


కారుచోల గ్రామసచివాలయంలో..

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కారుచోల గ్రామ సచివాలయం నందు రిజిస్ట్రేషన్ సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్, యడ్లపాడు తహశీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నరసరావుపేట

రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో కాలనీ వాసుల కోరిక మేరకు రూ 25 లక్షల నిధులతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి భూమి పూజ చేశారు.అనంతరం గ్రామంలో జరిగిన శుభకార్యంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, ఎంపిపి గడ్డం వెంకట్రావు, నాయకులు అంజనా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వద్దుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహక నగదు అందజేత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యలో ప్రతిభ కలిగి రాణించేవారికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ప్రోత్సహిస్తుంద ని సంస్థ చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. స్థానిక రాగన్నపాలెంనకు చెందిన అమ్మాజీ 10వ తరగతిలో చిలకలూరిపేట పట్టణంలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా అమ్మాజీ ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా దుశ్శాలువాతో గురువారం సత్కరించారు. అమ్మాజీ ఉన్నత చదువుకు ప్రోత్సాహంగా రూ. 10 వేలు అఆయన అదజేశారు. కార్యక్రమంలో పోతవరం గ్రామ సర్పంచ్ భాషా, పట్నం కరిముల్లా, జమ్మలమడక ఆది బాబు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు గదులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు గదులకు అధికారులు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఖాళీగా ఉన్న గదులకు మార్కెటింగ్ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు యార్డు చైర్మన్ పెండెం బాబురావు సమక్షంలో 7 గదులకు బహిరంగ వేలం వేసారు. 10 వేలు ధరావత్ చెల్లించి పాటలో పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా గురువారం పట్ట ణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తల్లిదండ్రులకు మలేరియా, డెంగీ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవాస ప్రాంతం, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడా లని, నీటి తొట్టిలో కొబ్బరి బోండాలు, పాత టైర్ల లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎనాఫిలిస్ దోమల వల్ల మలేరియా, క్యులెక్స్ దోమల వల్ల బోదకాలు, పగటి పూట కుట్టే దోమల వల్ల డెంగ్యూ, ఏడిస్ దోమ వల్ల చికున్ గున్యా, క్యూ లెక్స్ దోమ ద్వారా వ్యాపించే ఆర్బో వైరస్ వల్ల,పందులు ద్వారా చిన్న పిల్లలలో మెదడువాపు వ్యాధి, జ్వరా లు వస్తాయని అన్నారు. కనుక దోమలు కుట్టకుండా జాగ్రతలు తీసుకోవాలని, దోమతెరలు, ఆయింట్ మెంట్‌లు వాడాలని, తలుపులు కిటికీలకు మెష్ వాడాలని, దోమతెరలు ఉపయో గించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు మలేరియా శాఖ సిబ్బంది అర్‌సిహెచ్ నారాయణ, యన్.శివయ్య, యస్‌వి. చలమారెడ్డి, బి యస్.కోటేశ్వరరావు.షేక్ జిలానీ వివరించారు. అనంతరం పాఠశాల ఆవాస ప్రాంతం లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు
రూ.3.90 లక్షల అపరాధ రుసుము విధింపు

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమంగా విద్యుత్తు వాడుతున్న వారిపై 3.90 లక్షల రూపాయల అపరాధ రుసుము విధించినట్లు ఏఈ మస్తాన్వది తెలిపారు మీటరు ఉన్న విద్యుత్ సౌర్యం చేస్తున్న 8 మందికి 84 వేలు, డైరెక్ట్ గా చర్యానికి పాల్పడుతున్న 43 మందిపై 53 వేలు, అనుమతి లేని కేటగిరీల వారి నుంచి 4వేలు, అనుమతించని లోడు కంటే అదనంగా వాడుతున్న 48 మందిపై 2.49 లక్షల రూపాయల అపరాధ రుసుము విధించామన్నారు ఈ దాడుల్లో 34 మంది అధికారులు 102 మంది సిబ్బంది 34 బందాలుగా ఏర్పడి విద్యుత్ సౌర్యానికి పాల్పడుతున్న నోట ఒక మందిపై ఈ పెనాల్టీ విధించామన్నారు మల్లవరం, మంచుకల్లు, పాలువాయి, పసర్లపాడు, సత్రశాల, తుమ్మూరు కోట,గోలి తదితర గ్రామాల్లో దాడులు చేశామన్నారు. కార్యక్రమంలో డి ఈ ఎం రవికుమార్, కే రవికుమార్ ఎం శ్రీనివాసరావు ఏఈ కోటేశ్వరరావు, చంద్రశేఖరు తదితరులు పాల్గొన్నారు.

మంచి లక్ష్యాన్ని ఎంచుకుని... శ్రమించండి

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థులు పాఠశాల దశలోనే మంచి లక్ష్యాలను ఎంచుకుని, దానికి అనుగుణంగా శ్రమించాలని జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనిక్రిస్టీనా అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం జగనన్న ఆణిముత్యాలు పేరిట స్టేట్ బ్రిలియంట్ అవార్డులను నియోజకవర్గ స్థాయిలో పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందించారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో విద్యావ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. సిఎం జగన్ నేతృత్వంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించటం విశేషమన్నారు. తమ వంతు బాధ్యతగా ప్రతి పాఠశాలకు ఆల్ ఇన్ ఒన్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని, డి.ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాలల్లో చదివి 588 మార్కులు సాధించిన వి.దాక్షాయినిని ఉదాహరణగా చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు, వారిలో పోటీ తత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం వారిని సత్కరిస్తోందని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి, నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచిన విన్నకోట దాక్షాయినికి రూ.15 వేలు నగదు, ద్వితీయస్థానం పొందిన పెదరావూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పల్లికోట రాజ్యలక్ష్మికి రూ.10 వేలు, తృతీయ స్థానం పొందిన అత్తోట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి అద్దంకి గోవర్ధననాయుడుకు రూ.5 వేలు నగదుతో పాటు షీల్డులను అందించి, సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మండల విద్యాధికారి ఎం.లక్ష్మినారాయణ, ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటిసి పిల్లి ఉమాప్రణతి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యాబోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహం

ప్రజాశక్తి-తెనాలి రూరల్

విన్నకోట దాక్షణ్య

ఉత్తమ విద్యాబోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తెనాలి డివిజన్ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించ గలిగాను. అదనపు క్లాసుల నిర్వహణలో అధ్యాపకులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫలితంగా తెనాలి డివిజన్ స్థాయిలో 2022-2023 సంవత్సరానికి జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 588 మార్కులు సాధించ గలిగానని గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని విన్నకోట దాక్షణ్య తెలిపారు. స్టేట్ బ్రిలియన్స్ అవార్డు అందుకోవడానికి వచ్చిన దాక్షణ్య, ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నీలిమలు బండిపై పానీపూరి విక్రయిస్తుంటారని చెప్పింది. రోజుకు నాలుగు గంటలు పాటు అదనంగా చదువుకున్నానని, తరగతుల్లో ఉపాధ్యాయులు నేర్పిన బోధనాంశాలను అర్థం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపింది.

ప్రజాశక్తి - చేబ్రోలు

నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దాసరి భానుశ్రీ 586 మార్కులతో ప్రథమ స్థానంలో, డి.భరణి (584) ద్వితీయ స్థాన ంలో నిలిచారని ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. పొన్నూరు శ్రీరామ పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించి కార్యక్రమంలో పొన్నూరు ఎంపిపి భవనం పద్మలీల విద్యా ర్థులకు జ్ఞాపికలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పొన్నూరు మండల విద్యాశాఖ అధికారి రుద్రపాటి శోభాచంద్ విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనిక్రిస్టీనా

బహుమతులు అందుకున్న నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

గుత్తికొండ ధనుంజయరావుకు పరామర్శ

ప్రజాశక్తి-మంగళగిరి

కొద్దిరోజుల క్రితం మేడ మెట్లు దిగుతూ ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు ను కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జి వి నాగేశ్వరరావు గురువారం సాయంత్రం పరామర్శించారు. ధనుంజయరావును పరామర్శించిన వారిలో కోస్తాంధ్ర పద్మశాలి సంఘం చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి కారంపూడి అంకమ్మరావు, కోస్తాంధ్ర పద్మశాలి యువజన సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి తిరువీదుల కిరణ్, కార్యనిర్వహణ కార్యదర్శి జొన్నాదుల మోహన మురళి, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గుంటి రాజ్యలక్ష్మి, భూదాటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డు లంబాడీపేట పోలకంపాడు ఎఎ పాఠశాల నందు గురువారం సిఎం జగన్ చిత్ర పటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుకలో భాగంగా మూడు వేల రూపాయలు విలువ జేసే కిట్ అందజేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.ప్రకాష్, బి.దాసు, కె.రమేష్, ఉదయరాజు, రవీంద్ర, తిరుపతమ్మ, అంబారావు, పాపారావు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌కే అండ్ కేఎస్సార్ గుప్త కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని ఎన్ఆర్‌కె అండ్ కేఎస్సార్ గుప్త కళాశాల విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు పొందారు. ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం బుధ, గురువారాల్లో టిఎంఐ గ్రూపు ద్వారా యాక్సిస్ బ్యాంక్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యో గాలకు క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. కళాశాలలో ఫైనలియర్ బికాం, బిబిఎ, బిఎస్సీ చదువు తున్న విద్యార్థులు 11 మంది ఈ ఎంపిక ప్రక్రియలో ఉద్యో గాలు పొందారు. ఎంపికైన వారికి వార్షిక వేతనంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు ఉంటాయని యాక్సిస్ బ్యాంక్ హెచ్ఆర్ మేనేజర్ పి.జయప్రకాష్ వెల్లడించారు. ఎంపిక ప్రక్రియలో టిఎంఐ గ్రూపు ప్రతి నిధులు సంజయ్‌కృష్ణ, మణి కందన్, యాక్సిస్ బ్యాంక్ బృందం అప్పలరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఉద్యో గాలు పొందిన విద్యార్థులను పొట్టి శ్రీరాములు విద్యా సంస్థల అధ్యక్షులు నంబూరు వెంకటకృష్ణ మూర్తి, సెక్ర టరీ అండ్‌కరస్పాండెంట్ ఎన్.వెంకటవేణు గోపాల రావు, మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.దశ రథరామిరెడ్డి, కేవి రవికుమార్, ఎస్కె రఫి, ఎ.నాగ రాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి.అశ్విని అభినందించారు.

పంట చేను మరమ్మతు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎమ్మెల్యే సొంత నిధులతో కాల్వ మరమ్మతులు

ప్రజాశక్తి-దుగ్గిరాల

కష్ణ పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ బకింగ్హామ్ కెనాల్ నుండి పేరుకలపూడి గ్రామ సమీపంలో చీలిన పంట కాలు వకు అత్యవసర మరమ్మత్తు నిమిత్తం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృషారెడ్డి సొంత నిధులు కేటాయించినట్లు ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి తెలిపారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పంట కాల షట్టర్లు కొట్టుకుపోయి పంట చేలు మునిగాయి. అప్పుడు తాత్కాలిక మరమ్మతుల చేపట్టారు. ప్రస్తుతం మరమ్మతుల కోసం జల వనరుల శాఖ వారు ప్రతి పాదనలు పంపించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. ఈ విషయమై స్థానిక వైసీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి మూడు లక్షల రూపాయలు సొంత నిధులు కేటాయించారు. గురువారం పంట కాలువ తూములు మరమ్మత్తుల నిమిత్తం ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన నిర్వ హించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేకతోటి అరుణ, వైసిపి నాయకులు, సర్పంచ్ జి.గంగాధర్, ఎన్.కేశవరావు, జల వన రుల శాఖ డిఇ ఎన్టీవీ ప్రసాద్, ఎఇఇ వనిత పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ళ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలోని టిడ్కో ఇళ్ళ పట్టాలను గురువారం స్థానిక టిడ్కో గహసముదాయాల వద్ద పంపిణీ చేశారు.జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తిడ్కో ఛైర్మెన్ జె ప్రసన్న కుమార్, డైరెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు లబ్దిదారులకు పట్టాలు అందజేశారు.ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు నాయుడు టిడ్కో గృహాలను అరకొరగా నిర్మించి కనీస వసతులు లేకుండా ఉంచారని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ గృహాలను ఆధునీకరించి, వసతులు కల్పించారని చెప్పారు. టిడ్కో ఛైర్మన్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, మండలంలో 3,200 గృహాలకు తాగునీరు,విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైసిపి తాడికొండ నియో జకవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా

పంట సాగుదారుల చట్టంపై కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

దళిత బహు జన రిసోర్స్ సెంటర్ (డిబి ఆర్‌సి) పంట సాగుదారుల చట్టంపై ప్రచురించిన కర పత్రాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు అందరూ పంట సాగుదారుల కార్డులను పొందాలని, అందుకు భూ యజమానులు సహకరించాలని కోరారు. పంటసాగు కార్డుల ద్వారా బ్యాంకు రుణాలు, సబ్సి డీలు, ప్రభుత్వ పథకాలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ కార్డు పొందడానికి కౌల్దారుకు సంతకం చేయడం ద్వారా భూ యజమానికి ఎలాంటి నష్టం జరగదని, కౌలు రైతుకు భూమి పైన ఎలాంటి హక్కు ఉండదని, ఆ భూమిపైన పండించే పంట పరిమితి అయిన 11 నెలలు మాత్రమే ఈ కార్డు పనిచేస్తుందని అన్నారు. డిబిఆర్‌సి గుంటూరు గ్రామీణ ప్రాంత సమన్వయకర్త వి.భగ వాన్ దాస్ మాట్లాడుతూ పంట సాగుదారుల చట్టంపై కౌలు రైతు ల్ని చైతన్యపరచటానికి కరపత్రాలు రూపొందించి, పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

పట్టుదల, కృషితో ఉన్నత స్థానాలకు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పట్టుదల, కృషితో చదువుకుంటే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగవచ్చుని పెదనందిపాడు జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్) అధ్యక్షులు నూతిబాపయ్య చౌదరి(బాపు) అన్నారు గురువారం ఈ ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 5 గురు విద్యార్థులు కె లక్ష్మీ .జె శ్యాంబాబు .టి కుమార్ .వి రమ్య .కే సునీల్ బాబుల కు ఒక్కొక్కరికి పది వేల రూపాయలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుని లక్ష్మీ దుర్గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాపు విద్యార్థుల అభివృద్ధికి తగు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కోరిక మేరకు విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చేందుకు త్వరలో తమ సహకారం అందజేస్తామన్నారు. పాఠశాల బృందం బాపును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతి సుబ్బారావు, లక్ష్మీనారాయణ, బాపు ఫ్రెండ్ సర్కిల్ కె. నాగేశ్వరరావు,డి.సుబ్బారావు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు కె. సీతారామయ్య పాల్గొన్నారు

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేసిన పెదనందిపాడు జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి ఉత్తర అమెరికా తెలుగు సంఘం

22, 23 తేదీల్లో

వర్సిటీలో మెగా జాబ్ మేళా

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విసి రాజశేఖర్ తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

జూన్ 22, 23 తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వర్సిటీ విసి ఆచార్య పి. రాజశేఖర్ ప్రకటించారు. గురువారం జాబ్ మేళాకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ మేళాకు దేశవ్యాప్తంగా ఉన్న అనేక సంస్థల నుండి ప్రతినిధులు హాజరవుతారని విశిష్ట రంగాలలోని అనేక సంస్థలకు కార్యాలయాలకు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆచార్య నాగార్జున విద్యాలయం తో పాటుగా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలలోని విద్యార్థినీ విద్యార్థులు సైతం ఈ మెగా జాబ్ మేళా ద్వారా ఉపాధి అవకాశాలను పొందవచ్చనీ యూజీ, పీజీ, ఐటీ విద్యార్హతగా కలిగిన విద్యార్థులకు ఈ జాబ్ మేళా సువర్ణావకాశం అని తెలిపారు. ఐటీ, ఐ టి ఈ ఎస్, బిపిఓ, కేపిఓ, ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్ ఎలక్ట్రికల్స్, రీటైల్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్, ఎన్ బి ఎఫ్ సి, టెలికామ్, ఇన్సూరెన్స్, మెడికల్, ఫార్మా వంటి రంగాల నుండే కాక మరెన్నో రంగాల నుండి ఎన్నో ప్రముఖ సంస్థలు, ఆయా సంస్థల ప్రతినిధులు ఈ మెగా జాబ్ మేళాకు హాజరయ్యి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ మెగా జాబ్ మేళా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో ఉన్నత ఉద్యోగ అవకాశాలు సాధించాలని పిలుపునిచ్చారు. జాబ్ మేళా కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఈదర శ్రీనివాసరెడ్డి, ఆచార్య ప్రసాద్, సైన్సు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.గంగాధర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిద్దయ్య, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఆచార్య ఆంజనేయులు, ఆచార్య ఉదయ్ కుమార్, ఇంజినీర్ కుమార్ రాజా,డా. బి.ఎస్.నాగ కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు అందచేస్తున్న మేయర్ కావటి మనోహరనాయుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యారంగంలో విప్లవాత్మకైన నిర్ణయాలు తీసుకొని విద్యా రంగం అభివద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ పాఠశాలల్లో 10వ తరగతి చదివి, అత్యధిక మార్కులు (మొదటి మూడు స్థానాలు) సాధించిన విద్యార్థులు షేక్ మునావర్, హేమ శ్రీతులసి, స్నేహను గురువారం స్థానిక స్థంబాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య హైస్కూల్లో నిర్వహించిన అభినందన కార్యక్రమం లో పాల్గొని ప్రభుత్వం అందించిన పారితోషికం విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చదువుకి పేదరికం, కులం అడ్డుకాదని, విద్యార్థులు చదువుకునే సమయం లోనే లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఇటువంటి ప్రోత్సాహకాలు అందించటం ఎంతో అభినందించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్ ఉడుముల లక్ష్మీశ్రీనివాసరెడ్డి, సర్వశిక్షా అభయాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ : స్థానిక నల్లచెరువు 22వ లైన్‌లోని జిఎంసి అప్పర్ ప్రైమరీ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లన్లు మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఫలితంగా గడచిన 4 ఏళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు.

అలేఖ్యను అభినందిస్తున్న కె.వి సెబాస్టియన్, మంజూ సెబాస్టియన్

నీట్ ర్యాంకర్‌కు మాంటిస్సోరి అధినేత అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

నీట్ -2023 ఫలితాల్లో 55వ ర్యాంకు, ఇఎపి సెట్‌లో 28వ ర్యాంకు సాధించిన, స్థానిక లక్ష్మీపురంలోని మాంటిస్సోరి పాఠశాలలో చదివిన జి.అలేఖ్యను పాఠశాల అధినేత కె.వి.సెబాస్టియన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల్లో తమ పాఠశాలలో చదివిన విద్యార్థిని ఉత్తమ ర్యాంకులు సాధించటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అలేఖ్యను సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజూ సెబాస్టియన్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించకుంటే ఉద్యమిస్తాం

గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు హెచ్చరించాయి. గురువారం విద్యుత్ ఛార్జీల పెంపును నిరశిస్తూ స్థానిక బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పాశం రామారావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, జనసేన, బిఎస్‌పి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విద్యుత్ ఛార్జీల పెంపును ముక్త కంఠంతో ఖండించారు. ఈనెల 17న గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం, 19న అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర నాయకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.నళినీకాంత్, సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆంధ్రామేధావుల ఫోరం నాయకులు తాడికొండ నరిసింహారావు, బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు దొంతాసురేష్, చిరువీధి వ్యాపారు సంఘం నాయకులు సాంబయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బ్కెరగాని శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు

సామాన్యులపై పెనుభారం

సిపిఎం జిల్లా కార్యదర్శి, పాశం రామారావు

రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు, స్థిర ఛార్జీలు, ఇంధన చార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచింది. ఈనెల కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొట్టే విధంగా భారాలో మోపారు. రూ.200 అసలు బిల్లు అయితే రూ.250లు అదనపు ఛార్జీలు ఎక్కువగా ఉంటున్నాయి. పెరిగిన ఛార్జీలతో పేదలు, చేతి వృత్తులు, చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వచ్చిన నష్టాలను ఇప్పుడు సర్దుబాటు చేయటం దుర్మార్గం. ఒక వైపు నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులు అల్లాడుతుంటే ఇప్పుడు విద్యుత్ ఛార్జీల భారం మోపారు. ఈ భారాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి, జంగాల అజయ్‌కుమార్

పెంచిన ఛార్జీలు తక్షణమే ఉపసంహరించు కోవాలి. జగన్‌కు బటన్ నొక్కటం తప్ప ఇతర అంశాల్లో ఘోరంగా విఫలం చెందారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది.కరెంటు ఛార్జీల జోలికి వెళితే గతంలో చంద్రబాబు ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుంది. విద్యుత్ చార్జీల తగ్గించాలని జరిగే పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలి.

ప్రజలపై మోయలేని భారాలు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు

ఒక పక్క నిరుద్యోగం పెరుగుతోంది. ఉపాధి లేక ఆర్థిక వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉంది. ప్రజల వద్ద కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రకరకాల భారాలు మోపుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంది. పట్టణాల్లో ఆస్థి పన్నులు పెంచారు. చెత్త పన్ను విధిస్తున్నారు. ఇప్పుడు విద్యుత్ చార్జీలు కూడా పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా పరిపాలిస్తుంది. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకూ అన్ని పార్టీలతో కలిసి పోరాడతాం.

అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి తీవ్ర నష్టం

జనసేన జిల్లా కార్యదర్శి త్రినాథ్

11 నెలలుగా ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. 34 నాలుగు నెలల దాకా వసూలు చేస్తారు. 2014 నాటి ఛార్జీలను కూడా ఇప్పుడు బిల్లుల్లో కలిపి వసూలు చేయటం దుర్మార్గం. అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి తీవ్ర నష్టం. అద్దె ఇళ్లలో ఇంతకు ముందు వినియోగించిన బిల్లులకు ప్రస్తుతం అద్దెకుంటున్న వారు ట్రూ అప్ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ ఛార్జీలు పెంచుకునే విద్యుత్ తయారీ సంస్థలకు అవకాశం కల్పించటం వల్లే ఈ సమస్యలు.

సామాన్యులకు కరెంట్ షాక్

సిపిఐ(ఎంఎల్)రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు

మన్నవ హరిప్రసాద్

పెరిగిన విద్యుత్ చార్జీలతో సామాన్యుల జీవితాలు అతలా కుతలం అవు తున్నాయి. మోడి ప్రభుత్వ బాటలోనే జగన్ ప్రభుత్వమూ నడుస్తూ ప్రజలపై రకరకాల భారాలు వేస్తుంది. 2014-19 నాటి భారాలు ఇప్పుడు వసూలు చేయటం అన్యాయం.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్ని భారాలు మోపుతున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు వంతపాడటం సరికాదు.

8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచింది

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు,

వేల్పూరి నరసింహారావు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత దాదాపు 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ంది. ఈనెల బిల్లులు చూస్తుంటే ప్రజలు నోరెళ్లబెడుతున్నారు. 2000 సంవత్సరంలో 90 రోజులపాటు సాగిన విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరుల స్ఫూర్తితో రానున్న రోజుల్లో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకూ పోరాడతాం.

ప్రజల్లో అసంతృప్తి వస్తుంది

సిహెచ్.వాసు, బిఎస్‌పి నాయకులు

ఒక వైపు అప్రకటిత విద్యుత్ కోతలు, మరోవైపు విద్యుత్ ఛార్జీలు పెంచుతున్న ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది.ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమం ఉధృతం అవుతుంది. ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి. విద్యుత్ ఛార్జీల పెంపును తిప్పికొట్టాలి.

మోడీ బాటలోనే జగన్

యు.గనిరాజు, సిపిఐ(ఎంఎల్)

న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు

మోడీ అనుస రిస్తున్న విధానాలనే జగన్ ప్రభుత్వం అనుసరిస్తూ ప్రజలపై భారాలు వేస్తున్నారు. పట్టణ సంస్కరణలు, విద్యుత్ సంస్కరణలతో పేరుతో పన్నులు వేస్తున్నారు. రైతుల పొలాలకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారు. అంబానీకి, సామాన్యులకూ ఒకే విధమైన విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి.